విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 18, ఏప్రిల్ 2025

గాలి, వాన బీభత్సం..

విశాలాంధ్ర - శెట్టూరు : ఈదురు గాలులు బీభత్సానికి మామిడి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయని రైతు కట్ల నరసింహప్ప వాపోయారు. మండల పరిధిలోని అనుంపల్లి గ్రామానికి చెందిన రైతు కట్ల నరసింహప్పకు ఉన్న మూడు ఎకరాల విస్తీర్ణంలో మామిడి చెట్లు ఉన్నాయి. అయితే బుధవారం రాత్రి ఈదురు గాలులూ ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి బీభత్సమైన ఈదురు గాలులు వీచడంతో దాదాపుగా 80శాతానికి పైగా మామిడి కాయలు నేలరాలయి. పగలు భారీ ఎండ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి గాలులు వీస్తుండటంతో మామిడి రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదని మండల వ్యాప్తంగా ఉన్న మామిడి రైతులు తీవ్ర నిరాశతో వున్నారు పర్యవేక్షించాల్సిన ఉద్యానశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వం మామిడి రైతులను ఆర్థికంగా ఆదుకొనేవిదంగా కృషిచేయాలని మామిడి రైతులు కోరారు.

ఈ విషయం పైమండల ఉద్యానశాఖ అధికారిణి గౌసియా బేగంను వివరణకోరగా.. జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని వారు తెలిపారు.

జాతీయ కౌన్సిల్ సభ్యులుగా
చిరుతల మల్లికార్జున , అన్నగిరి కాటమయ్య

విశాలాంధ్ర - బ్యూరో అనంతపురం : రైతు సమస్యలపై దేశంలో అనేక పోరాటాలు చేస్తూ కర్షకులకు న్యాయం చేస్తున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్లో అనంతపురం జిల్లా వాసులకు చోటు లభించిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, అనంతపురం జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జునలు అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తమిళనాడులోని నాగపట్నం కేంద్రంగా మూడు రోజులుగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహా సభలు జరుగుతున్నాయి. ఈ సభల్లోనే జాతీయ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో అనేక పోరాటాలు చేశారు. విద్యార్థి, కార్మిక, రైతు పక్షాన అనేక పోరాటాలు చేసి వారి హక్కులను పరిరక్షించారు. వీరి సేవల్ని గుర్తించిన జాతీయ నాయకులు ఈ ఇద్దరు నాయకుల్ని జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ప్రకటించారు.తమకు దక్కింది మంచి పదవి కాదని.. తమపై అతి పెద్ద బాధ్యత ఉంచారని.. కచ్చితంగా రైతుల పక్షాన, ఎన్డీఏ రైతు వ్యతిరేక విధానాల మీద పోరాటాలు సాగిస్తామని మల్లికార్జున, కాటమయ్యలు తెలిపారు. అఖిల భారత రైతు సంఘం సభ్యులుగా ఎన్నికైనందుకు అనంతపురం జిల్లా సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తి నారాయణస్వామి, చెన్నప్ప యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

అనంతపురం - బెంగళూరు రైలుకు ఆమోదం

ఎంపీ కృషికి ఫలితం

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : అనంతపురం జిల్లా సామాన్య ప్రజల అనేక సంవత్సరాల కోరికకు భారత రైల్వే శాఖ స్పందించింది. శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరుకు నడుస్తున్న మెము (మెమో) రైలును అనంతపురం వరకు పొడిగిస్తూ కేంద్ర రైల్వే బోర్డు 2025 ఏప్రిల్ 15న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సుస్థిర నిర్ణయం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ నిరంతర కృషితో, పట్టు, నిబద్ధతతో సాధ్యమైంది. ప్రజల ప్రయాణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని, పార్లమెంట్ సమావేశాల్లో డిమాండ్ చేసి అనేకసార్లు దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ పశ్చిమ రైల్వే జనరల్ మేనేజర్లను కలిసి, పుట్టపర్తి - బెంగళూరు రైలును అనంతపురం వరకు పొడిగించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ విషయాన్ని పరిష్కరించేందుకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి వీరన్న సోమన్నని వ్యక్తిగతంగా కలుసుకొని, ఆయనను ఈ అంశంలో జోక్యం చేసుకుని పుట్టపర్తి - బెంగుళూరు రైలును అనంతపురం వరకు పొడిగించాలని కోరారు. వారి సహకారంతో, రెండు రైల్వే జోన్‌లను ఒప్పించి, ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న అనంతపురం ప్రజలకు రైలు సౌకర్యాన్ని అమోదం చేశారు. ఇప్పటి వరకు ఉన్న స్టాపేజ్‌తో పాటు సోమేశ్వర, విధురాస్వర్థం, కొత్త చెరువు, బాసంపల్లె, చిగిచెర్ల, జంగాలపల్లె, ప్రసన్నాయనపల్లి స్టేషన్‌లో కూడా ఈ రైలు స్టాపింగ్ సదుపాయం ఇస్తూ ఈ పొడిగింపు ప్రయాణ మార్గంలో కలపబడ్డాయి. ఈ సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారత ప్రభుత్వ రైల్వే శాఖకు, రైల్వే అధికారులకు, కేంద్ర సహాయ మంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తూ అతి త్వరలోనే కేంద్ర రైల్వే మంత్రి చేతుల మీదుగా ఈ సేవ త్వరలోనే అమలులోకి రానుందని తెలిపారు. ఈ రైలు అనంతపురం స్టేషన్ నుండి మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి సాయంత్రం 7గంటలకు బెంగళూరు స్టేషన్ చేరుకుంటుంది.

పీఎఫ్ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ రామచంద్రారెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ఎస్టియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరు రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉపాధ్యాయులు నెల నెలా చెల్లిస్తున్న పిఎఫ్ రికవరీలు 2021 మార్చి నుండి ఆన్ లైన్ చేయడం లేదని వాటిని ఉపాధ్యాయుల ఖాతాల్లోకి జమ చేయాలని వారు కోరారు. వెంటనే ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాను అప్డేట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె. చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్. కృష్ణ మోహన్,జిల్లా కార్యదర్శి జి. మల్లిఖార్జున జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణ, సీనియర్ నాయకులు పి. మధుసూదన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

పాల్యంతండాలో పోషణ పక్వాడ

విశాలాంధ్ర-పామిడి: పామిడి మండల పరిధిలోని పాలెం తండా గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడాపై లబ్ధిదారులకు లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లులకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకా హారం ప్రయోజనా లను వివరించారు. పిల్లల్లో ఎత్తుకు తగ్గ బరువు, ఆరోగ్యం, ఎదుగుదల, మహిళల్లో రక్తహీనత తదితర అంశాలపై వివరించారు.

అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-రాప్తాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్మయ నగర్ సచివాలయంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్న వీరమ్మ కూతురుకు మెదడుకు సంబంధించిన తీవ్రమైన జబ్బు ఉండడంతో బెంగళూరులో చికిత్స చేయిస్తున్నారు. చికిత్స నిమిత్తం రూ.2 లక్షలు ఖర్చు అవుతుందని డాక్టర్లు సూచించగా వీరమ్మ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో డాక్టర్ శివకృష్ణ చొరవతో పి.హెచ్.సి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పిలు, ఆశా కార్యకర్తలు కలిపి రూ.26,500 వీరమ్మకు గురువారం ఆర్థిక సాయం అందజేశారు.

రాష్ట్రంలో ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గుంతకల్లు : పట్టణంలో శ్రీ శస్త్ర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి షభనాజ్‌కు గుంతకల్ శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం, మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి గురువారం పట్టణంలో 25వ వార్డుకు చెందిన షబనాజ్‌కు శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం నారాయణస్వామి స్వయంగా వారి ఇంటికి వెళ్లి విద్యార్థిని సత్కరించి రూ.57వేల 500 విలువ గల లాప్‌టాప్ బహుమతిగా అందజేశారు. లాప్టాప్ బహుమతిగా ఇచ్చి భవిష్యత్తుకు భరోసా అందిస్తానని ముందుకు వచ్చిన శాసనసభ్యులు గుమ్మనూరు జయరాంకి మండల ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయ ణస్వామికి ధన్యవాదాలు తెలిపిన విద్యార్థిని షబానాజ్, వారి కుటుంబ సభ్యులు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండార ఆనంద్,ముఖ్య నాయకులు,మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఉరవకొండ : వజ్రకరూరు మండల కేంద్రంలో గురువారం మండల రెవెన్యూ అధికారి ఎస్ నయాజ అహ్మద్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించి రోగాలకు దూరంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది వ్యాధులపై ముద్రించిన అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

కలప దందా..
కాసుల పంట



కలపను రవాణా చేస్తున్న.. ఇంతవరకు నన్ను ఏ అధికారి ఆపలేదు..

విశాలాంధ్ర - గార్లదిన్నె : పచ్చని ప్రకృతిని కబలిస్తూ ప్రకృతి వనరులను ఆదాయ వనరులుగా మార్చుకుంటూ ధనార్జన ముఖ్య ధ్యేయంగా కొందరు స్వార్థపరులు విచ్చలవిడిగా చెలరేగిపోతుంటే పట్టించుకోని అధికార యంత్రాంగం. వివరాల్లోకి వెళితే అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన ఓవ్యక్తి ప్రకృతి వనరులైన పచ్చని చెట్లను విచ్చలవిడిగా నరుకుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని కమలాపురం, కేసవాపురం, కల్లూరు శివారు అటవీ ప్రాంతంలో నుండి విచ్చలవిడిగా కలపను నరుకుతూ కల్లూరు లో వున్నటువంటి పలు ఫ్యాక్టరీలకు బహిరంగంగా కలపను తరలిస్తున్నారు. కేసవాపురం రవాణా వాహనం సంబంధించిన డ్రైవర్ని ప్రశ్నించగా నన్నెవరూ ఆపేది నేను రోజు కలపను రవాణా చేస్తున్న ఇంతవరకు ఏ అధికారి నన్ను పట్టుకోలేదు నువ్వు ఎవరు ఆపేది అంటూ అసభ్యకరమైన పదాలతో దూషించాడు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లు ఆటోల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను నియమ నిబంధనలను గాలికి వదిలేస్తూ ధనార్జన ముఖ్య ధ్యేయంగా వారి ఆగడాలను కొనసాగిస్తూ ఉన్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి పచ్చని చెట్లను నరికి సొమ్ము చేసుకునే వారిపై తగిన చర్యలు తీసుకొని ప్రకృతి వనరులను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శిల్పారామానికి పర్యాటక శోభ

విశాలాంధ్ర-అనంతపురం క్రైం: నగర శివారులోని శిల్పారామంలో కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ చొరవతో పర్యాటకులను ఆకర్షించే కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా శిల్పారామంలో బ్యాటరీ కార్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి గురువారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు, పర్యాటక శాఖ అధికారులతో కలిసి బ్యాటరీ కార్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన అందులో ప్రయాణిస్తూ.. పార్కు మొత్తం తిరిగారు. శిల్పారామం మొత్తం చూసేందుకు ప్రజల సౌకర్యవంతంగా ఉండేలా, చిన్న పిల్లలకు వినోదం కోసం, అలాగే మ్యారేజ్ ఫోటోషూట్‌కు వచ్చే వారికి ఈ బ్యాటరీ కారు ఉపయోగపడనుందన్నారు. ఈ సందర్భంగా శిల్పారామంలో ఉన్న సమస్యల్ని ఎమ్మెల్యే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తు, కొత్త బోర్ ను ఏర్పాటు చేయడానికి ఆదేశాలిచ్చారు. కొత్త టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి, శిల్పారామం పార్క్ లో మరిన్ని అభివృధి పనులకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. శిల్పారామంలో నెల వ్యవధిలో పెడల్ బోటింగ్ యాక్టివిటీ ప్రారంభించాలని ఆదేశించారు. పర్యాటకులకు ఆకర్షించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు ఉండాలన్నారు. శిల్పారామం ఏవో శివ ప్రసాద్, స్థానిక టిడిపి నాయకులు డాక్టర్ హరిప్రసాద్, సాదిక్, దాదాపీర్, బాబు, ధనమూర్తి, లింగమయ్య, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీ నరసింహ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, టిడిపి నాయకులు వెంకటేశ్వర రెడ్డి, నెట్టెం బాలకృష్ణ, మహిళ నాయకురాలు వడ్డే భవాని, శోభ,రమీజా,మంజులతదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలను పాటించాలి

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లాలోని అన్ని పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలను పాటించాలని, ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐఏఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌లను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో భద్రత అనేది చాలా ముఖ్యమైనదన్నారు. జిల్లాలో ఆఫ్ సైట్ కెమికల్ ఎమర్జెన్సీ ఏర్పడినపుడు దానిని సమర్థవంతంగా అదుపు చేయడానికి, ప్రజలకు, పర్యావరణానికి ఎటువంటి నష్టం జరుగకుండా ఉండేందుకు కావలసిన ఆఫ్ సైట్ అత్యవసర ప్రణాళికని రూపొందించాలన్నారు. ఆఫ్ సైట్ అత్యవసర ప్రణాళిక ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి మోక్ డ్రిల్స్‌ను నిర్వహించాలని అధికారులను, పరిశ్రమల యజమాన్యాలను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సేఫ్టీ కమిటీ మీటింగ్‌ను ఏర్పాటు చేయాలని ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్‌ని ఆదేశించారు. ఆయా పరిశ్రమలలో ప్రమాదకర రసాయనలపై కార్మికులకు అవగాహన కల్పించాలని, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా భద్రతపై ప్రతి ఒక్క కార్మికునికి తెలియజేయాలన్నారు. పరిశ్రమలలో రసాయనాలు లీక్ అయితే సంబంధిత పోలీస్ స్టేషన్ కి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కి, ఎస్డిఆర్ఎఫ్ సెల్, తదితరులకు సమాచారం వచ్చేలా ఎస్ఎంఎస్ అలెర్ట్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ, కెమికల్ ఫ్యాక్టరీస్ కార్యనిర్వాహకులు, భద్రతా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-తాడిపత్రి : జనసేన పార్టీ పేరుతో మోసం చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ కదిరి శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్లూరు రోడ్డు ఆర్డిటి కాలనీలో కొందరు వ్యక్తులు జనసేన పార్టీ నుంచి వచ్చామని మీకు పింఛన్లు, ఇల్లు ఇప్పిస్తామని, కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చింది.అలాంటి వారిని నమ్మి మోసపోవద్దని జనసేన పార్టీ తరపున ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. జనసేన పార్టీ తరపున మేము ఎప్పుడూ మంచి చేస్తాము కానీ డబ్బులు వసూలు చేయమని ప్రజలు దానిని గుర్తించాలని కోరారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమాలు చేయాలన్నప్పుడు జనసేన పార్టీ తరపున పత్రికా ముఖంగా ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. కావున ప్రజలు సంక్షేమ పథకాల పేరుతో మోసం చేసే వారి మాటలు నమ్మొద్దండని ప్రజలకు సూచించారు.

అధికారులు డుమ్మా..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా. మండల అధ్యక్షురాలు పద్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. తమ శాఖల ద్వారా మండల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సేవలను వివరించారు. వేసవిలో అవసరమైన కీలకశాఖ అధికారులు గైర్హాజరవ్వడం గమనార్హం. విద్యుత్, ఆర్డబ్ల్యుఎస్, ప్రధాన వైద్యాధికారులు ఈ సమావేశానికి డుమ్మాకొట్టారు. మండలంలో తాగునీటి సమస్య ఎక్కడ ఉందో ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులకు తెలపాలన్నా ఆర్డబ్ల్యుఎస్ అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు మండిపడ్డారు. మండలంలో విద్యుత్కోతలు ఉన్నాయని ప్రజాప్రతినిధులు చెప్పాలన్నా ఆ శాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఉద్యానవన, ఎక్సైజ్, హెచ్చెల్సీ అధికారులు సమావేశానికి డుమ్మాకొట్టారు. ఇది ఇలా ఉండగా కొందరు ఎంపీటీసీ సభ్యులు సమావేశం జరుగుతుండగానే సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్, తహశీల్దార్ మునివేలు, ఏఓసాయి కుమార్, పీఆర్ జేఈ జగదీష్ పశు వైద్యాధికారి వెంకట్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

కొత్త విషయాల అధ్యయనం.. ప్రగతికి జీవనాడి

విశాలాంధ్ర- జేఎన్టీయూ ఏ : తరగతి గదిలో బోధించే విద్యాబోధనలో కొత్త విషయాల అధ్యయనం ప్రగతికి జీవనాడిగా నిలుస్తుందని ఓటిపిఆర్ఐ సంస్థ సంచాలకులు ఆచార్య జీ.వీ. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఓటిపిఆర్ఐ కళాశాలలో 2021 బీఫార్మసీ బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డైరెక్టర్ మాట్లాడుతూ విద్య సం..ముగించుకుని వెళ్లే ప్రతి విద్యార్థి స్నేహితులు, కళాశాల, విజ్ఞానాన్ని అందుకొని వెళుతున్నప్పుడు కన్నీటి బాధతో వెళుతున్న.. ఉజ్వల వికాసం వైపు అడుగుల వేసేందుకు కొత్త ప్రయాణం చేయవలసి వస్తుందని అన్నారు. డిప్యూటీ రిజిస్టర్ బి దుర్గాప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర-కూడేరు :మండల కేంద్రంలోని కూడేరు గ్రామ నివాసి అయిన జాఫర్ వలి, అతని ఏకైక కుమారుడు జావేద్ మైనార్టీ విద్యార్థి గుంతకల్ సమీపంలోని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం, ఈ ఘటన గుంతకల్, మండలంతి మ్మనచర్ల గ్రామ సమీపంలోని రైల్వే స్టేషన్ వద్ద ఈ సంఘటన జరిగిందని, స్థానికులు గుంతకల్లు రైల్వే పోలీసులకు జరిగిన సంఘటన సమాచారం అందించడంతో ఘటన స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఆత్మహత్యకు కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్టు తెలిసింది, కూడేరుకు చెందిన జావేద్ మైనార్టీ విద్యార్థి అమ్మమ్మ వాళ్ళ ఊరు గుంతకల్‌లో ఉంటూ చదువుకునేవాడు. గుత్తి గేట్స్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతూ ఉన్నాడు. మొన్న జరిగిన కూడేరు శ్రీ జోడి లింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా తిరుణాలలో కూడేరు కు వచ్చి అందరితో కలిసి సరదాగా తిరిగాడని. ఇలాఎందుకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు తెలియడం లేదని మృతిని తల్లిదండ్రులు బంధువులుకన్నీటి పర్వతమయ్యారు.

ఆర్టీసీ బస్సును అడ్డగించిన విద్యార్థుల తల్లిదండ్రులు

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలో కోన రోడ్డు కూడలిలో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఆర్టీసీ బస్సు ను అడ్డగించారు. వాగ్దేవి హై స్కూల్ దగ్గర ఉన్న బస్ స్టాప్‌లో విద్యార్థుల చేయి ఆపిన ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో, గత కొద్దిరోజుల నుండి ఇలాగే చేస్తుండడంతో స్కూల్ విద్యార్థులకు నిరుత్సాహానికి గురయ్యారు .స్థానిక ప్రజలు, తల్లిదండ్రులు ఆర్టీసీ బస్సు ను అడ్డగించారు. దీంతో గంట పాటు రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. అనంతరం పోలీసులు జోక్యం చేసుకోవడంతో అర్టీసి డ్రైవర్ విద్యార్థులను బస్సులోకి ఎక్కించుకోన్నారు. దీంతో సమస్య సర్దుమణిగింది.

వేతన సవరణ చేయాలి

విశాలాంధ్ర - బెలుగుప్ప : మండలంలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల గురువారం నిరసన వ్యక్తం చేశారు. మీ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా తమకు కూడా 23శాతం సవరణ చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఆరోగ్య కేంద్రం అద్దె ఎలక్ట్రిసిటీ బిల్లులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రతినెల రావలసిన ప్రోత్సహాకాలు ఇవ్వడం లేదని వారు తెలిపారు. దాని ఫలితంగా తమ కుటుంబాలు ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారనీ వారు తెలిపారు. న్యాయమైన తమ కోర్కెలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

సామాజిక న్యాయానికి చారిత్రాత్మక ముందడుగు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - శింగనమల : ఎస్సీ ఉప వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదంతో సామాజిక న్యాయానికి చారిత్రాత్మక ముందడుగు పడినట్లయిందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదిక ఆధారంగా మంత్రుల కమిటీ సిఫారసులతో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపింది. 200 పాయింట్ల రోస్టర్ విధానం ప్రకారం రిజర్వేషన్లు సమానంగా పొందేలా చర్యలు చేపట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ వర్గీకరణలో భాగంగా గ్రూప్-1కి 1శాతం, గ్రూప్-2కి 6.5 శాతం, గ్రూప్-3కి 7.5 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు, తద్వారా అన్ని ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే డీఎస్సీ నోటిఫికేషన్ నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి రానున్నాయి. ఇది విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చూపిన సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలివ్వాలి : సీపీఐ

విశాలాంధ్ర-తాడిపత్రి: నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని నిరసన తెలిపి తాహసిల్దార్ రజాక్ వలికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ గతంలో తాహసిల్దార్ కార్యాలయం వద్ద పట్టణంలో ఇల్లు లేని వారికి పట్టణంలో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 5లక్షల రూపాయలు ఇవ్వాలని, దాదాపు మూడు వేల నిరుపేదలతో కలసి అర్జీలు ఇచ్చామన్నారు. కావున అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఇల్లు లేని నిరుపేదల ఇంటి స్థలాల కోసం అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ మహిళా కార్యదర్శి సావిత్రమ్మ, అబ్రహం, నాగార్జున, ఫాతిమా పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించండి

విశాలాంధ్ర-తాడిపత్రి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించండని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.రంగయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని తేరన్నపల్లి గ్రామ సమీపంలో ఉపాధి హామీ కూలి పనులు చేసే వారిని కలసి ఉపాధి కూలీల సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించి వలసలు ఆపాలని, ఉపాధి హామీ పథకాని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, కూలి రేట్లు పెంచాలన్నారు. 10 వారాలుగా పెండింగ్లో ఉన్న పాత బకాయిలు చెల్లించాలని తదితర సమస్యలపై ప్రభుత్వాన్ని రిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీ నుండి 23వ తేదీ వరకు బండ్లపల్లి పప్పూరు గ్రామం నుండి అనంతపురం వరకు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కష్టజీవుల పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఏ. నారాయణరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి ఏ.నాగ రంగయ్య పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

రూ.లక్షలు పెట్టి బోర్లు.. కరువైన విద్యుత్

అధికారుల నిర్లక్ష్యంతో అగచాట్లు పడుతున్న రైతులు

సమస్య చెప్పుకుందాం అంటే చిక్కని ఎస్ఈ

విశాలాంధ్ర - పుట్టపర్తి : దేశానికి వెన్నెముక అయిన అన్నదాతలకు అడుగడుగునా కష్టాలు వెంటాడుతున్నాయి. అన్నదాత అవస్థలు శ్రీ సత్యసాయి జిల్లాలో చెప్పుకోలేని స్థితిలో ఉండిపోయింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో .. రైతు రాజు అయ్యే పరిస్థితి లేదు. వీరి నిర్లక్ష్యం వల్ల రైతు కాటికి వెళ్లే పరిస్థితి నెలకొంది. జిల్లాలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. లక్షలు అప్పు చేసి బోర్లు వేసినా, అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ఆత్మహత్య శరణ్యం అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. బత్తలపల్లి మండలం ఈదులుముస్టూరు గ్రామం రైతులు తమకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలంటూ గురువారం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంకు వచ్చారు.

రైతుల సమస్య : శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం ఈదులుముస్టూరులో రైతులు ఆదిలక్ష్మమ్మ, తలారి కాటమయ్య, తలారి లింగప్ప, వెంకటేష్, శివయ్య కష్టాలు వర్ణనాతీతంగా తయారయ్యింది. వారు జిల్లా విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరగడం వారి వంతు అయిపోయింది. బోర్లు వేసి విద్యుత్ సౌకర్యం కోసం రెండు సంవత్సరాల క్రితం 2023లో ఏపీఎస్పీడీసీఎల్ పేరిట ఒక్కో రైతు 45 వేల రూపాయలు చొప్పున డీడీ తీశారు. ఇప్పటి వరకు కూడా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడం అధికారుల వంతు అయిపోయింది. విద్యుత్ ట్రాన్స్ ఫార్మార్లు వచ్చినా కేబుల్, మెటీరియల్ రాలేదంటూ ఏఈ శివయ్య సాకులు చెప్పడం జరుగుతోంది. రైతులను జిల్లా విద్యుత్ శాఖ అధికారి వద్ద అలాట్మెంట్ తీసుకువస్తే కేబుల్, మెటీరియల్ ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది. దీంతో పంటలు ఎండిపోతున్నాయనీ కన్నీరు పెట్టుకుంటున్నారు. అన్ని పనులు వదులుకొని 70 కిలోమీటర్లు ప్రయాణించి జిల్లా కార్యాలయానికి రావాలంటే కష్టతరంగా మారిందని ఆవేదన చెందారు.

చిక్కని సూపరింటెండెంట్ ఇంజనీర్ : రైతులు మాత్రం ప్రతిరోజు ఈదులుముస్టూరు నుంచి వచ్చి జిల్లా కార్యాలయం చుట్టూ తిరిగి వెళ్లడం జరుగుతుంది. దాదాపు 70 కిలోమీటర్లు వ్యయ ప్రయాసలు భరించి జిల్లా కార్యాలయానికి వచ్చి సమస్య చెప్పుకుందాం అంటే సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేంద్ర మాత్రం చిక్కడమే లేదని రైతులు వాపోతున్నారు. అక్కడ చూస్తే ఏఈ స్పందించరు, ఇక్కడ చూస్తే సూపరింటెండెంట్, ఇంజనీర్ మాత్రం కనిపించరు. మా సమస్య ఎలా పరిష్కారం అవుతుందో..? సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలిపారు. కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని, విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలని కోరారు.

రైతుల్లారా..
భూములపై హక్కులు కోల్పోకండి

విశాలాంధ్ర-నంబులపూలకుంట: మండల పరిధిలోని వంకమద్ది, గురికానివారిపల్లి, పెదరాంపల్లి, పుల్లగురవాండ్లపల్లి, తాటిమానుగుంత, ఓర్సువాండ్లపల్లి, రంగనపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాలలో గురువారం ఎపి రైతు సంఘం నాయకులు హరి,జంగాలపల్లి పెద్దన్న విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామాలలోని రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు మాయమాటలు చెప్పి సోలార్ ప్రాజెక్ట్ పేరుతో భూములను కార్పొరేట్ కంపెనీల వశం చేస్తారని తెలిపారు. ఈ గ్రామాలలో గొర్రెలు, మేకలు,తదితర జీవాలైన పశువులను మేపుకుని జీవనోపాధి పొందుతున్నారని , సోలార్ నిర్మాణాలు చేపడితే ఇలాంటి కుటుంబాలు రోడ్డున పడతాయని,సోలార్ ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇవ్వకుండా అడ్డుకోవాలని కోరారు. ప్రజల తరుపున జిల్లా రైతు సంఘం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. శుక్రవారం జవకల గ్రామంలో జరిగే సభకు రాష్ట్ర నాయకులు ప్రభాకర రెడ్డి హాజరవుతున్నారని,అధిక సంఖ్యలో రైతులు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, నాగిరెడ్డి,ఈశ్వర్ రెడ్డి, నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అగళి : అగళి మండలంలో శుక్రవారం మంత్రులు అనగాని సత్యప్రసాద్ గొట్టిపాటి రవికుమార్ సవితమ్మ సత్యకుమార్, ఎంపీ పార్థసారథి పర్యటనను విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్ అగళి మండల టీడీపీ అధ్యక్షులు కుమరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఇనగలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన 33/11కెవి సబ్ స్టేషన్‌ను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రులు చేతుల మీదుగా ప్రారంభిస్తారన్నారు.

విశాలాంధ్ర-అమరాపురం: మండలంలో నేడు శుక్రవారం మండల పరిధిలోని శివారం గ్రామంలో విద్యుత్ సబ్టేషన్ ప్రారంభం చేస్తున్నందున మండల పరిధిలోని నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ గణేష్ ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రులు అనగాని సత్యప్రసాద్ గొట్టిపాటి రవికుమార్, సవిత, సత్యకుమార్‌లు ప్రారంభోత్సవానికి హాజరవుతున్నారన్నారు. అమరాపురం మండల మండలంలోని కె శివారం గ్రామంలో నూతనంగా ఏర్పాటైన 33/11కెవి సబ్ స్టేషన్ ను శుక్రవారం మధ్యాహ్నం 2:30లి గంటలకు ప్రారంభిస్తారని అన్నారు.

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని కె.కె.పాళ్యం విద్యుత్ స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రులు పాల్గొంటారని మండల ప్రధాన కార్యదర్శి ప్రకాష్ తెలిపారు. కేకే పాల్యం గ్రామంలో నూతనంగా విద్యుత్ సబ్ స్టేషన్ శంకుస్థాపన శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు చేరుకుంటారని మడకశిర శాసనసభ్యులు ఎమ్.ఎస్. రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, తెలిపారు.

మహిళా హత్య కేసును చేదించిన రూరల్ పోలీసులు

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని రేగాటిపల్లి వద్ద మార్చి నెల 16న జరిగిన అక్కమ్మ హత్య కేసును రూరల్ పోలీసులు ఒక్క నెలలో నే కేసు చేదించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్లో నిందితుల అరెస్టు వివరాలను సీఐ ప్రభాకర్ వెల్లడించారు. అనంతరం వారు మాట్లాడుతూ మార్చి 16న ధర్మవరం కళాజ్యోతి కూడలి వద్ద ఉన్న అక్కమను ఆటో డ్రైవర్లు శిక్షావలి లోకేంద్ర ఆటోలో ఎక్కించుకొని రేగాటిపల్లి పొలాల్లోకి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు. అక్కడ అక్కమ్మకు లోకేంద్రకు గొడవ కొనసాగిందని తెలిపారు. తదుపరి శిక్షావలి సహాయంతో అక్కమ్మ తలపై రాయితో బలంగా కొట్టడం జరిగిందన్నారు. తదుపరి తెరవద్ద ఉన్న చాకుతో గొంతు కోసి హతమార్చడం జరిగిందని తెలిపారు. నిందితులైన ధర్మవరం ఎల్ - 2 కాలనీకి చెందిన తలారి లోకేంద్ర, శాంతినగర్ వాసి శిక్షావలిని మండలంలోని సీతారామ పల్లి జాతీయ రహదారి వద్ద అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. వీరి ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్కు పంపడం జరిగిందని తెలిపారు. మహిళా హత్య కేసును త్వరితగతిన ఛేదించినందుకు కృషి చేసిన సీఐ ప్రభాకర్, ఎస్ఐ. శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ శత్రు నాయక్, రామాంజనేయులు, కానిస్టేబుల్ బాబాజాన్, రాజప్ప, షాకీర్, అనిల్ కుమార్, రాజేంద్ర, బాలకృష్ణ పోలీసులను జిల్లా ఎస్పీ రత్న డిఎస్పి హేమంత్ కుమార్, అభినందించారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

విశాలాంధ్ర-బత్తలపల్లి: శ్రీ సత్యసాయి జిల్లాలో జరుగుతున్న మోటార్ సైకిళ్ల దొంగతనాలపై జిల్లా ఎస్పీ శ్రీమతి రత్న ఆదేశాల మేరకు పోలీసులు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ధర్మవరం డి.ఎస్.పి హేమంత్ కుమార్, ధర్మవరం రూరల్ సిఐ ప్రభాకర్ పర్యవేక్షణలో బత్తలపల్లి ఎస్సై సోమశేఖర్ మరియు వారి సిబ్బందికి లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం ఉదయం బత్తలపల్లిలోని మెయిన్ హైవే వై జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగలు పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రెండు మోటార్ సైకిళ్లపై వస్తున్న ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు బత్తలపల్లి, ధర్మవరం, అనంతపురం టౌన్ పరిధిలో మొత్తం 11మోటార్ సైకిళ్లను దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుండి సుమారు రూ.10లక్షల విలువైన 11మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు అనంతపురం టౌన్‌కు చెందిన ప్రణయ్ (19), దనుష్ (19), సిద్ధి వినయ్ (19) ముగ్గురు జువైనల్స్ అని పోలీసులు తెలిపారు. ఈముఠాపై మొత్తం 10 కేసులు నమోదయ్యాయి. వీటిలో బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు, ధర్మవరం టౌన్ పోలీస్ స్టేషన్‌లో మూడు మరియు అనంతపురం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన ధర్మవరం డీఎస్పీ హేమంత్, సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, బత్తలపల్లి సిబ్బంది గంగాధర్, నల్లప్ప, పిసిలు గోపాల్, ఆంజనేయులు, అనిల్, లింగయ్య, జనార్ధన్, సుదర్శన్ నాయుడు, సుధాకర్ నాయుడులను జిల్లాఎస్పీ రత్న అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, పట్టుబడిన యువకులు చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని వారు సూచించారు.

పరీక్ష ఫలితాలపై సమావేశం

విశాలాంధ్ర-కొత్తచెరువు: జిల్లాలో కస్తూరిబాయ్ బాలికల విద్యాలయాలలో 2024 - 25 విద్య సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో వచ్చిన ఫలితాలపై గురువారం ఏపీ సమగ్ర శిక్షణ సత్యసాయి జిల్లా కార్యాలయంలో ప్రిన్సిపల్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పతక సమన్వయ అధికారి డాక్టర్ పి.దేవరాజు, మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థినికి మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కేజీ బీబీలకు 12 కళాశాలకు 100 శాతం ఇంటర్ విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించారని మిగిలిన వాటిలో కూడా 100శాతం సాధించేలా కృషి చేయాలని ఆయన సూచించారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థులు మంచి మార్కులు రావడానికి మీరు కృషి చేయాలని కోరారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని 200 మంది రోగులకు శ్రీ సత్య సాయి సేవ సమితి-2, పిఆర్టి వీధి సుబ్బదాసు భజన మందిరం నిర్వాహకులు పాలు, బ్రెడ్లు ,బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టపర్తి బాబా ఆశీస్సులతో దాతల సహాయ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి సేవ సమితి-2 వారు చేస్తున్న ఇటువంటి సేవలు ఎందరికో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

జీతాల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర - హిందూపురం: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు న్యాయమైన డిమాండ్ అమలుకు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నందు పని చేయుచున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు చొలూరు, కె బసవనహళ్లి, బేవనహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద గురువారం నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా వారు ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు అందరు యమ్ యల్ హెచ్‌పిలను రెగ్యులర్ చేయాలని, గ్రామీణ ఆరోగ్య మందిరాల బాడుగుల బకాయిలు వెంటనే చెల్లించాలని, 23 శాతం వేతన సవరణ, ఇతర యన్ హెచ్ యమ్ ఉద్యోగుల తో సమాన వేతనం చెల్లించాలని, సాధారణబదలీలకు అనుమతించాలని, మిడిల్వెల్ హెల్త్ ప్రొవైడర్ ల జాబ్ చార్ట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధి కూలీలకు వెంటనే బిల్లులు చెల్లించాలి

విశాలాంధ్ర-ఓబులదేవరచెరువు: మండలంలోని వివిధ పంచాయతీలలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన బిల్లులు కూలీలకు వెంటనే చెల్లించాలని వారికి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కూలీలకు పని దినాలు 100నుండి 200వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రామచంద్ర, సుధాకర, రవణప్ప, సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడి పార్థివ దేహానికి నివాళి

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి, వైయస్సార్సీపి నాయకులు ఖాన్ బ్రదర్ తండ్రి గారైన ఇబ్రహీం ఖాన్ అనారోగ్య కారణంగా తుది శ్వాస విడిచారు, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, శ్రీ సత్య సాయి జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీ చరణ్, గోరంట్ల మండల నాయకులతో పాటు వారి స్వగృహం చేరుకొని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఇబ్రహీం ఖాన్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి దేవికి హారతులు

విశాలాంధ్ర-రొళ్ల : మండల పరిధిలోని బ్యాడగేరి గ్రామంలో చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి కొల్లాపూరి మహాలక్ష్మి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, బ్యాడగేరి లోకేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి గ్రామంలో కొల్లాపూరి మహాలక్ష్మి దేవికి మరియు అంబేద్కర్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్వయం ఉపాదే ప్రభుత్వ లక్ష్యం

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించిన మంత్రి

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ

విశాలాంధ్ర-పెనుకొండ: మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం ఉపాదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాల నందు మహిళలకు ఉచిత కుట్టు మిషన్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవితమ్మకి ఘన స్వాగతం పలికిన కూటమి నాయకులు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి సవితమ్మ మాట్లాడుతు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి ఆర్థికంగా వెనుకబడిన బీసీల మహిళ లందరికీ ఉచితంగా టైలరింగ్ శిక్షణ ఇచ్చి మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తాంమని మండల వ్యాప్తంగా 7 కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, 90 రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని ,శిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని మంత్రి సవితమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ప్రహరీ.. న్యాయం చేయండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: రామగిరి మండలం, గొంతుమర్రిలోనీ పోలేరమ్మ ఇంటి స్థలంలో ఆమె బాబాయి ప్రహరీ గోడ నిర్మిస్తున్నాడని నాకు న్యాయం చేయాలని బాధితురాలు పోలేరమ్మ కోరారు. గురువారం పెట్రోల్ బాటిల్ చేత పట్టుకొని కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుంది. బాధితురాలు పోలేరమ్మను ఎస్సై శ్రీరాములు అడ్డుకొని పెట్రోల్ బాటిల్ తీసుకొని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. బాధితురాలు పోలేరమ్మ మాట్లాడుతూ తన స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను తొలగించి న్యాయం చేయాలని కలెక్టర్ చేతన్ వేడుకొన్నారు. స్పందిం చిన కలెక్టర్ ఆమె సమస్యను పరిష్కరించమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ను ఆదేశించారు. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోలేరమ్మను విచారి ంచి వివరాలు సేకరించారు. గొంతుమర్రిలో డోరు నెంబరు 1/85లో 1.5సెంట్లులో సొంత ఇల్లు ఉందని బాధిత మహిళ తెలిపిం ది. తనకు సంబంధించిన ఖాళీ జాగాలో తన బాబాయి ఓబులేసు అనే వ్యక్తి అక్రమంగా గోడ నిర్మించారని వాపోయారు. ఆగోడను తొలగించాలని ఎంత కోరినా ఆయన పట్టించుకోవడం లేదన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా స్థానిక సర్వేరు, వీఆర్వో తన బాబాయికే సహకరించి తనకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. కలెక్టరు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆత్మహత్య శరణ్యమని వాపోయారు.

జిల్లా ఎస్పీ రత్నాకు అభినందనలు..

విశాలాంధ్ర-ధర్మవరం : రాష్ట్రవ్యాప్తంగా కేసుల పరిశోధన-చేదించుటలో జిల్లా రెండవ స్థానం కైవసం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతులమీదుగా ఎస్పి రత్న అవార్డు అందుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్, వన్ టౌన్ సిఐ నాగేంద్రప్రసాద్, టూ టౌన్ సీఐ రెడ్డప్ప, రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్సైలు, ట్రాఫిక్ ఎస్సై, ఆయా పోలీస్ స్టేషన్ల హెడ్ కానిస్టేబులు, కానిస్టేబుళ్లు, హెూంగార్డ్స్ తదితరులు ఎస్పీ రత్నాకు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

వెయ్యి రోజుల సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-చిలమత్తూరు: చిలమత్తూరు మండలం, కొడికొండ గ్రామంలో సీడీపీఓ శాంతి ఆదేశాల మేరకు సూపర్వైజర్ రాధ ఆధ్వర్యంలో వెయ్యి రోజుల సంరక్షణపై గర్భవతులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8నుండి 22వరకు నిర్వహిస్తున్నారు. పిల్లల్లో లోపపోషణ, లబ్ధిదారులు పోషణ ట్రాకర్‌లో స్వీయ నమోదు ప్రక్రియ, పిల్లలలో జంక్ ఫుడ్ శారీరక కార్యకలాపాలు లేకపోవడం వలన జరుగు నష్టాలుపై అవగాహన కలిగించడం.1000 రోజుల సమయంలో తల్లి బిడ్డ ఆరోగ్యం గా ఉంటే వారికి జీవితకాలం ఆరోగ్యం యొక్క ప్రయోజనాలు ఉంటాయి. మంచి ఆహార అలవాట్లు జీవితకాలం పురోగతికి మెట్లు తదితర అంశాలపై సూపర్వైజర్ రాద లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానో పాధ్యుడు అలీముల్లా కొడికొండ సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ టౌన్, పరిటాల డిగ్రీ కాలేజ్ శివార్లలో ఒక గుర్తు తెలియని మగశవం. సదరు మగ శవం యొక్క వయస్సు సుమారు 40-45 సంవత్సరాలు ఉండవచ్చు, అతను స్కై బ్లూ కలర్ ఫుల్ షర్ట్, నసీమ్ రంగు ఫుల్ డ్రాయర్ మరియు వాక్రో కంపనీ కి చెందిన బ్రౌన్ రంగు చెప్పులు ధరించి, బట్టతల కలిగి ఉండినాడు. అతని పేరు ఊరు చిరునామా తెలిసిన యెడల పెనుకొండ పోలీస్ స్టేషన్, ఎస్సై ఫోన్ నెంబర్ 9440769842 అను నంబరు కు ఫోన్ చేసి తెలుపగలరని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సమన్వయకర్త

విశాలాంధ్ర - అగళి : అగళి మండలం మదూడి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు లక్ష్మమ్మ వీరభద్రప్ప కుమారుడు కర్ణాటక రాష్ట్రం హాసన్ పట్టణంలో బేకరీలో పని చేసుకుంటూ ఉండేవాడని అతను తన స్వగ్రామమైన మధుడి గ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ నుండి కిందపడి మరణించడంతో గురువారం ఈ విషయం తెలుసుకొన్న మడకశిర నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్ ఎల్ ఈరలక్కప్ప మృతుని స్వగ్రామమైన మదూడి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని అధైర్య పడద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో బేకరీ యజమాని మను, సర్పంచ్ శివకుమార్, వైస్ ఎంపీపీ ఆరోగ్య స్వామి, చంద్రప్ప సూర్యనారాయణ రెడ్డి, శీనప్ప తదితర వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

వక్ఫ్ సవరనను ఉపసంహరించుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర - హిందూపురం : పట్టణంలోని సిపిఐ నాయకుల సమావేశం సిపిఐ కాలనీ నందు గురువారం నిర్వహించారు. వక్ఫ్ అంటే ఏమిటి వాటి గురించి వివరణ 2025 వక్ఫ్ సవరణ బిల్లు గురించి, సిపిఐ హిందూపురం కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ వివరించారు. రేపు జరగబోయే వక్ఫ్ బోర్డ్ అమెండ్మెంట్ యాక్ట్ 2025కు వ్యతిరేకంగా, హిందూపురం పట్టణం నందు జరిగే ర్యాలీ కార్యక్రమంలో సిపిఐ శ్రేణులు, రేపు భాగస్వామ్యం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ నాయకులు మారుతి రెడ్డి, సమీవుల్లా, నౌషాద్, ఇమ్రాన్ ఖాన్, హరుణ్, ముస్తఫా, సద్దాం తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని నాగులూరు గ్రామం వద్ద గల రూపా రాజా పిసీ ఎంఆర్ పాఠశాలలో గురువారం ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగిందని పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్కూల్ నుండి ప్రైమరీ స్కూలుకు విద్యార్థులు మారే రోజున ఈ గ్రాడ్యుయేషన్ వేడుక జరుపుకుంటారు అని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తదుపరి ప్రీఫైనరీ విద్యార్థులలో ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులకు చైర్మన్ సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాల డైరెక్టర్స్ రూప రాజా కృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని మహాత్మా గాంధీ నగర్ లో అనారోగ్యంతో బాధపడుతున్న వడ్డే శ్రీనివాస్ కుటుంబానికి ధర్మవరం రిటైర్డ్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు చలపతి, ఉపాధ్యక్షులు శ్రీరాములు, కార్యదర్శి శివలింగన్న, కోశాధికారి సుధాకర్ తమ వంతుగా రూ.2,500 ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి కుటుంబాలకు ప్రతి ఒక్కరూ ఆర్థిక సహాయం అందించి మానవతా విలువలు పెంచేలా సహకరించాలని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఉద్యోగ సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎస్ఐ శ్రీరాములకు ఉత్తమ అధికారిగా అవార్డు

విశాలాంధ్ర - అగళి : స్థానిక పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ శ్రీరాములకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకొన్నారు. వీధి నిర్వహణలో అంకితభావం చిత్తశుద్ధి తో పని చేయడం పట్ల డిజిపి,జిల్లా ఎస్పీ చేతుల మీదుగా, మడకశిర సర్కిల్ పోలీసుల కృషిని ప్రశంసిస్తూ నగదు తో పాటు అవార్డు కూడా అందించారు. ఉత్తమ అధికారిగా అవార్డు అందుకొన్న ఎ ఎస్ ఐ శ్రీరాములుని మండల ప్రజలు అభినందించారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లా సోమందేపల్లి మండలంలోని గుడిపల్లి సజ్జా గంటా రంగనాథ స్వామి వారి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా, ధర్మవరం పట్టణంలోని శ్రీ లలితా నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ, రామ లాలిత్య తోపాటు పదిమంది చిన్నారులు చేసిన నాట్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. స్వామివారి సన్నిధిలో అన్నమయ్య సంకీర్తనలకు నాట్యములు నిర్వహించారు. రామరాలిత్య చేసిన రామాయణం నృత్య రూపకం అందరినీ అలరించింది.తదుపరి ఆలయ ధర్మకర్త రమాకాంత్ రెడ్డి నిర్వాహకులు, రంగాచార్యులు కలసి గురువులను నాట్య కళాకారులను సన్మానించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం గురువులు మాట్లాడుతూ ఇటువంటి అవకాశం మాకు రావడం ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు.

కోర్టుకు కియా కేసు నిందితులు

విశాలాంధ్ర-పెనుకొండ: కియా కార్ ఇంజన్ల చోరీ కేసులో నిందితులను సిట్ పోలీసులు పెనుకొండ కోర్టు నందు హాజరపరిచారు కియా పరిశ్రమ నుంచి 940 కారు ఇంజన్లు మాయమైన కేసులు ఏడుగురు తమిళనాడు ఒక చిత్తూరు జిల్లా వాసి పట్టుబడ్డారు కు చెందిన పటాన్ సలీం తమిళనాడుకు చెందిన వినాయక న్, మూర్తి అరుణ్ కుమార్ మోహన్ రాజ్ మణికందన్ అర్జున్ అక్బర్ ఉన్నారు . వీరిపై 318 /4, 316 /2, 316 /5,61/1 బిఎన్ఎఫ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు, వినాయక సలీం కీలక నిందితులని మిగిలిన వారు వీరికి సహకారం అందించినట్లు తెలిసింది వీరిని కస్టడీకి తీసుకొని పోలీస్ శాఖలు పెద్ద స్థాయి అధికారులు విచారిస్తారని సమాచారము ప్రస్తుతానికి కియా కార్ల ఇంజన్లను రికవరీ చేయలేదు అరెస్ట్ అయిన ఏడుగురు తమిళనాడుకు చెందిన వ్యక్తులను మరియు కోర్టుకు హాజరు పరిచిన తర్వాత పెనుకొండ సబ్ జైలుకు తరలించారు.

జూదరులు అరెస్ట్

విశాలాంధ్ర-పుట్టపర్తి: నగర పంచాయతీ పరిధిలోని కోవెలగుట్టపల్లి పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడు మంది జూదరులను రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు. గురువారం జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీసులు తనిఖీలు చేస్తుండగా పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై లింగన్న మాట్లాడుతూ గంగమ్మ గుడి వెనుక వైపు గుట్టలో జూదం ఆడుతున్న స్థావరంపై దాడి చేయడం జరిగిందన్నారు. ఏడుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.60,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను క్రమబద్ధీకరించండి

విశాలాంధ్ర - చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం నిరసన వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలోని ఆయుష్మన్ ఆరోగ్యమందిరాలలో సిహెచ్ ఓలుగా పని చేస్తున్న గత 2సంవత్సరాలుగా జీతాభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నామని, దీనికి సంబంధించి మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరసనలో భాగంగా ఈరోజు చిలమత్తూరు పిహెచ్‌సి పరిధిలో శాంతియుత నిరసన చేపట్టారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్ హెచ్ ఎం ఉద్యోగులతో సమంగా 23 శాతము వేతన సవరణ జరగాలని, పనిఆధారిత ప్రోత్సాహకాలను సకాలంలో అందజేయాలని, ఈపీఎఫ్ ను పునరుద్ధరించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్‌ను అందించాలని, హెచ్ ఆర్, ఇంక్రిమెంట్, ట్రాన్స్ఫర్ పాలసీలను అమలుపరచాలని కోరారు.

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని దాసరపల్లి కొన్ని నెలల నుండి తాగునీటి సమస్యతో గ్రామ ప్రజలు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో తెదేపా నాయకులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తిలకు దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించి గురువారం బోరు బావిని తవ్వించగా పుష్కలంగా నీళ్లు లభించడంతో ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర కార్యదర్శి లకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక సర్పంచ్ గౌరమ్మ తనయుడు శివన్న, టిడిపి నాయకులు నారాయణప్ప నాగరాజు,, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 18, ఏప్రిల్ 2025

అగ్ని ప్రమాదాలుపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-ధర్మవరం: అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అగ్నిమాపక ప్రమాదాలు వాటి నివారణ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అగ్నిమాపక అధికారి యు.రాజు తెలిపారు. ఈ సందర్భంగా నాలుగవ రోజు అగ్నిమాపక అధికారి రాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పుట్టపర్తి రోడ్డులో గల వంశీకృష్ణ నోబెల్ స్కూల్ నందు అగ్ని ప్రమాదాల నివారణ లో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి డెమో ద్వారా చూపించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గ్యాస్ ఉపయోగములు తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి, ప్రమాద నివారణ గూర్చి తెలిపారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల సిబ్బందికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ అగ్నిమాపక వారోత్సవాలు ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు జిల్లా అధికారుల ఆదేశాలమేరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పట్టణ అగ్నిమాపక కేంద్రానికి గాని 101 కు సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల పరిధిలోని మోటు వారి పల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎన్నో ఏళ్ల నుంచి రాజకీయ నాయకులతో సమస్యను చెప్పుకున్న ఆసమస్యను తీర్చడానికి ఏ నాయకుడు ముందుకు రాకపోవడంతో గత ఎన్నికలలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి మోటువారిపల్లి నుంచి అమ్మవారి పల్లి,వరకు తారు రోడ్డు వేయిస్తానని మాట ఇచ్చిన ప్రకారము గురువారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు, మంత్రికి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ పూల వర్షం కురిపించారు ఇచ్చిన హామీల నెరవేర్చడానికి మా మంత్రి మా గ్రామానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని మహిళలు పెద్ద ఆనందం వ్యక్తం చేశారు ఈ యొక్క రోడ్డు నిర్మాణము 1,60 లక్షలతో నిర్మాణం పనులు చేస్తారని మంత్రి తెలిపారు. జలహారతి చేసిన మంత్రి సవితమ్మ... మండల పరిధిలోని కురుబ వాండ్లపల్లి గ్రామం నందు కృష్ణా జలాలతో హంద్రీ నీవా కాలువ ద్వారా చెరువు నింపడంతో చెరువు మరవపారి మోటు వా రిపల్లి చెరువు రెండు చెరువుల నింపడంతో రెండు గ్రామాలకు త్రాగునీరు సాగునీరు ఇబ్బంది లేకుండా ఉండడంతో గ్రామ ప్రజల యొక్క అభీష్టం మేరకు జలహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలీసుల సౌకర్యార్థమే హెల్మెట్ బ్యాంకు

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీసుల సౌకర్యం కోసం జిల్లా కేంద్రంలోని మహి ళా పోలీసు స్టేషన్‌లో హెల్మెట్ బ్యాంకు, డీహై డ్రేషన్ బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం సంతోష కరమని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. గురువారం స్థానిక మహిళా పోలీసు స్టేషన్లో అనంత పురం డిస్కవరీ వారి సహకారంతో స్థానిక మహిళా పోలీస్ స్టేషన్, త్రీటౌన్ పోలీసు స్టేషన్ సిబ్బంది కోసం 24హెల్మెట్లు, సుమారు 300సర్జికల్ క్యాప్స్, ఫ్రిడ్జి, కూల్ వాటర్, ఎలెక్ట్రోలైట్, గ్లూకోజ్ బాటిళ్లువితరణగా అందజేశారు. అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్లలో హెల్మెట్ బ్యాంకులతో పాటు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఫ్రిడ్జిలు, 15 నుండి 18వేల కూల్ వాటర్, ఎలెక్ట్రోలైట్, గ్లూకోజ్ బాటిళ్లు అందజేసేలా డిస్కవరీ అనంతపురం వారు ముందుకు రావడం ముదావహమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. డిస్కవరీ అనంత పురం నిర్వాహకులు అనిల్ కుమార్, డీఎస్పీలు మహబూబ్ బాషా, శ్రీని వాసరావు,సిఐలు శాంతిలాల్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సరస్వతి పూజా..

విశాలాంధ్ర-ఓడిసి రూరల్ : పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయులు కలిసి సరస్వతి దేవి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా సరస్వతి చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు గౌస్ లాజమ్, తంగేడు కుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట చలమయ్య, గొల్లవారి పల్లె ప్రధానోపాధ్యాయులు గణేష్, పుట్టా సుధాకర్, సిఆర్పి నరసింహులు, బలిజ పల్లి అంగన్వాడి ఉపాధ్యాయురాలు అరుణమ్మ, బోధనేతర సిబ్బంది విమల, లక్ష్మీన రసమ్మ, నరేష్ విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగునికి ట్రై సైకిల్ పంపిణీ

విశాలాంధ్ర-కొత్తచెరువు : కొత్తచెరువు మండల పరిధిలోని తలమార్ల గ్రామానికి చెందిన సుదర్శన్ మానసిక వికలాంగుడు నడవలేని స్థితిలో పుట్టినప్పుడు నుంచి ఉన్నాడని ఈ విషయం ఖీద్మత్ ఏ ఖల్క్ ఈ విషయం తెలియడంతో ఆయన దాతలు అన్నపూర్ణేశ్వరమ్మ, వరలక్ష్మి, జ్ఞాపకార్థంతో వారు ఆర్థిక సాయం చేయడంతో ట్రై సైకిల్ పంపిణీ చేశారు. తమ ట్రస్టు ద్వారా విద్యార్థులకు వికలాంగులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షాకీర్, రామంజి, గోపి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనే ధ్యేయం

విశాలాంధ్ర-అనంతపురం క్రైం : జిల్లాలో పనిచేస్తున్న పలు శాఖల సమన్వయంతో గంజాయి వినియోగించే కంజ్యూమర్స్‌ను గుర్తిద్దామని అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి సూచించారు. గంజాయి వినియోగం రవాణా నివారణ అంశాలపై గురువారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పలు శాఖల అధికారులతో అదనపు ఎస్పీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. పోలీస్, ఎక్సైజ్, జిల్లా ఈగల్ సెల్, విద్యాశాఖ, గ్రామ, వార్డు సెక్రెటరీ, తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి గంజాయి, తదితర మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన కంజ్యూమర్స్ కోసం డోర్ టు డోర్ సర్వే చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదక ద్రవ్యాల సమాచారం సేకరించడానికి తయారు చేసిన 1972 టోల్ ఫ్రీ నంబర్ ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ, జిల్లా జైలు, డ్రగ్స్, ఎక్సైజ్, తదితర ప్రభుత్వ విభాగాల అధికారులతో పాటు వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సి.ఐ లు హరినాథ్, వెంకటేష్ నాయక్, జయపాల్ రెడ్డి, జిల్లా ఈగల్ సెల్ ఆర్ ఎస్ ఐ హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అగ్నిమాపక నివారణపై అవగాహన

విశాలాంధ్ర-అనంతపురం: అగ్నిమాపక వారోత్సవ కార్యక్రమంలో బాగంగా అనంతపురం నగరంలోని చైతన్య స్కూల్ టవర్ క్లాక్ బ్రాంచ్ నందు గురువారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా నివారించాలో విద్యార్థులకు ఏడిఎఫ్ఓ కెపి. లింగమయ్య అవగాహన కల్పిస్తూ డెమో ద్వారా వివరంగా తెలిపారు. మొదటిగ అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే పొగ గదుల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించవలెను అక్కడ చిక్కుకున్న వ్యక్తులను రెస్క్యూ మెథడ్స్ ద్వారా పైనంతస్తుల నుండి వారిని రక్షించి సహాయ చర్యలను అందించే విధానాన్ని తెలిపారు. పై అంతస్తు నుండి చైర్ నాట్ సహాయంతో పై అంతస్థులలో ప్రమాదాలలో చిక్కుకొని స్పృహ కోల్పోయిన వ్యక్తులను ఎలా కిందికి దింపవచ్చును అనునది డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్‌లు జి.గోవింద రాజులు, ఎస్. రమేష్ కుమార్ రెడ్డి, ఈ.ఈరేష్ గౌడ్ డిఓ పి,ఎఫ్ ఎంలు సి. మధుసూదన, వై.ఓబీ రెడ్డి, జి.శ్రావణ కుమార్, జి.తిప్పే స్వామి, కే.జయరాముడు, కే.అనిల్ కుమార్, బి.సుధాకర్, ఏం.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

22న వాహనాల వేలం..

విశాలాంధ్ర-రాప్తాడు : మండల పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 19 వాహనాలను ఈనెల 22వ తేదీన రాప్తాడు పోలీసు స్టేషనులో వేలం వేయనున్నట్లు సీఐ టీవీ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాప్తాడు మండల మేజిస్ట్రేట్, తహశీల్దార్ పి.విజయకుమారి అనుమతి మంజూరు చేసినట్లు తెలిపారు.

కంభగిరి రాముడు మృతి పట్ల సంతాపం

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రం కమ్మ వీధిలో నివాసం ఉంటున్న కంభగిరి రాముడు నిన్నటి రోజున వడదెబ్బ తగిలి కర్నూల్ హాస్పిటల్ లో మృతి చెందడం జరిగింది. అయన పార్థివాదేహాన్ని కంభగిరి రాముడు స్వగృహంనకు తీసుకోని రాగ విషయం తెలిసి బొంబాయి రమేష్ నాయుడు ఎంపీటీసీ సభ్యులు బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు వల్లూరు వెంకటనాయుడు, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వేడుకలు

విశాలాంధ్ర-పామిడి: మండలం పరిధిలోని ఎద్దులపల్లి గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలలో హరితదివ్యాంగులసేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, బి.మోహన్ నాయక్ విద్యార్థినులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు, చంద్రకళ, సావిత్రి, మంజుల, ధనలక్ష్మి, వరలక్ష్మి, సలమ్మ, భార్గవి బాయి, మౌనిక బాయి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీం ఖాన్ మృతికి సంతాపం

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణానికి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ఆయుబ్ ఖాన్, యునుస్ ఖాన్,(ఖాన్ బ్రదర్స్) తండ్రిగారైన ఇబ్రహీం ఖాన్ గారు నేటి తెల్లవారుజామున స్వర్గస్థులైన విషయం తెలుసుకొని గోరంట్ల పట్టణంలో వారి స్వగృహం వద్దకు వెళ్లి ఇబ్రహీం ఖాన్ మృతదేహం వద్ద సంతాపం తెలియజేసి వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రివర్యులు వైయస్సార్ కాంగ్రెసు పార్టీ పి ఏ సి కమిటీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల ఎంపీపీ, జడ్పీ కో ఆప్షన్, మాజీ టౌన్ కన్వీనర్,మాజీ మార్కెట్ యాడ్ వైస్ చైర్మన్ ,సర్పంచులు, ఎంపీటీసీలు, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదంపై కూటమి నేతలకు మాదిగల పాలాభిషేకం

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణం లోని టిడిపి కార్యాలయం వద్ద భారత ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర బిబిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ చిత్రపటాలకు మాదిగ నేతలు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో సురేష్ మాదిగ, బూదిలి రామచంద్ర, లక్ష్మీపతి మాదిగ, నరసింహులు, గుమ్మయ్య గారి పల్లి రమేష్ మాదిగ, నరసింహులు, కసిరెడ్డిపల్లి గంగాధర్, వెంకటరాముడు, అప్పయ్య, రామాంజనేయులు, సోము తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - హిందూపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 16 వ ఆర్థిక సంఘం కమిషన్ పెద్ద ఎత్తున నిధులు మున్సిపాలిటీలకు వెచ్చించి మున్సిపాలిటీల ప్రగతికి తోడ్పాటును అందించాలని, తిరుపతిలో జరిగిన సమావేశంలో గురువారం చైర్పర్సన్ డిఈ. రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలి విద్యుత్తు బకాయిలు ఎక్కువవుతున్నాయని, విద్యుత్ ఆదా చేయాలంటే సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి, అనువైన ప్రాంతంలో గొల్లపల్లి రిజర్వాయర్ లాంటి ప్రాంతాలలో విండ్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తే విద్యుత్తు ఆదా అవుతూ, ఆమొత్తం మున్సిపాలిటీలు అభివృద్ధి కోసం వాడుకోవచ్చునన్నారు. రోడ్ల విస్తరణ చేయాలని, విస్తరించిన తర్వాత రోడ్లు కాలువ నిర్మాణం చేస్తే పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మున్సిపాలిటీ పాలీ ప్రదేశాలలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు షాపింగ్ మాల్ లు ఏర్పాటు చేయాలని, తద్వారా వచ్చే ఆదాయంతో మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాతుందని, మున్సిపాలిటీలకు వివిధ ప్రభుత్వ సంస్థలతో వచ్చే పన్నులు సకాలంలో చెల్లించాలని, స్టాంప్ డ్యూటీ వంటివి మున్సిపాలిటీ ఖాతాలో ఎప్పటికప్పుడు జమ చేయాలన్నాన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మున్సిపల్ మేయర్లు చైర్మన్లు సూచనలు చేస్తూ సమస్యలను కమిషన్ దృష్టి తీసుకుని వచ్చారు.

గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనంతపురం : అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో గురువారం సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వర్గాల వారి నుండి ఫిర్యాదుల సేకరణకు నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, డిఆర్ఓ ఏ.మలోల, అడిషనల్ ఎస్పీ డివి రమణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీవో కేశవ నాయుడు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, సోషల్ వెల్ఫేర్ డి డి రాధిక, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ జయంతి రామ్ జయంతి సందర్భంగా ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల వారి గ్రీవెన్స్ ను ఏర్పాటు చేయాలని కొంతమంది సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు కోరడం జరిగిందని, దానిని దృష్టిలో ఉంచుకొని ఈరోజు ఏర్పాటు చేయడం జరిగిందని, గత ఆగస్టు మాసంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాల వారి గ్రీవెన్స్ వచ్చిన అర్జీలు పరిష్కరించబడ్డాయని, ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి 238 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కారం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని ఏపీ వర్కర్స్ అండ్ ఎంప్లా యిస్, సిఐటీయు మండల కన్వీనర్ జేవి. రమణ, కో కన్వీనర్ అయూబ్ ఖాన్, సంఘం అధ్యక్ష కార్యదర్శులు బాబు ముకుంద లక్ష్మి ఓబులేసు, ఇంజనీరింగ్ కార్మిక సంఘ అధ్యక్షులు నాగరా జు, జయ తెలిపారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మి కులకు ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్ ఔట్సో ర్సింగ్ పద్ధతిని రద్దుచేసి కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, కనీస వేతనం అమలు చేస్తామని, ఎన్నికల సందర్భంగా ఎన్డీఏ ప్రభుత్వం హామీఇ వ్వడం జరిగిందని, కానీ ఎన్నికల తర్వాత కార్మి కులకున్న ఆప్కాస్ పద్ధతిని రద్దుచేసి ,కాంట్రాక్టు పద్ధతిని అమలు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అటువంటి ప్రయత్నాలు వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన సమస్యలను వినతి పత్రంగా మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌కి అందజేశారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ మీసమస్యలను జిల్లా అధికా రులకు ప్రభుత్వ దిష్టికి తీసుకుని వెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పీఎస్‌యూ జాతీయ మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రగతిశీల విద్యార్థి సంఘం నాలుగవ జాతీయ మహాసభలు కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో మే నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జాతీయ మహాసభలు నిర్వహించడం జరుగుతుందని, ఈ సభలను విజయవంతం చేయాలని పి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని బీసీ హాస్టల్ నందు జాతీయ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన జాతీయవిద్యా విధానం ఏకపక్షంగా అమలు చేస్తుందనిఅన్నారు. ఈ కారణంగా ప్రభుత్వ విద్యా సర్వనాశనం అయ్యింది అని, అలాగే దేశంలో ని ప్రభుత్వ ఆస్తిని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మేస్తుంది అని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నందకిషోర్, ప్రశాంత్, గిరీష్, మహేంద్ర, నరసింహ పాల్గొన్నారు.

వాసవి మహల్‌లో 19న మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-గోరంట్ల: అత్యవసర సమయంలో రక్తం దొరకక ఎంతో మంది తమ ప్రాణాలను వదులుతున్నారు, కావున రక్తం అవసరం దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని గోరంట్ల శ్రీ ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎన్ బలరాం గుప్తా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేయబడిన వెంకట లక్ష్మమ్మ, నూకల ఈశ్వరయ్య చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్థిక సహాయంతో శనివారం 19- 4 -2025 వ తేదీన శనివారం శ్రీ సత్య సాయి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్త తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ హాజరవుతున్నారన్నారు. ఈ శిబిరంలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కండి, రక్తదానం ఇచ్చేవారు ప్రతి ఒక్కరు ఉదయం 8:30 నిమిషాలకు గోరంట్ల పట్టణంలోని శ్రీ వాసవిమహల్ కు రావాలని వారు తెలిపారు. రక్తదానం చేయదలచిన వారు వారు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు గౌరీ శంకర్ 9440 497266, మణికంఠ 9949206042, తిరుపాల్ 9949337849, శివ ప్రకాష్ సాయి శ్రీకర్ మెడికల్ స్టోర్ 9490894 601లను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలరాం గుప్తా మరియు కమిటీ సభ్యులు కోరారు, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బలరాం గుప్తా, కార్యదర్శి నందగోపాల్, మణికంఠ, తిరుపాల్, శివ ప్రకాష్ సాయి శ్రీకర్ మెడికల్ స్టోర్, ప్రసాద్, సుకుమార్ గుప్తా , మంజునాథ్,విజయ్ కుమార్ ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు సన్మానం

విశాలాంధ్ర - గుంతకల్లు : పట్టణంలోని ఈద్గా ఫంక్షన్ హాల్ లో కార్పెంటర్స్ ఐక్యమాత్య సమితి ఆధ్వర్యంలో గుంతకల్ శాసనసభ్యులు గుమ్మనూరు జయ రాంకి కార్పెంటర్స్ అందరు కలిసి గజ పూల మాలతో శాలువాతో సన్మానం చేసి అపురూపమైన బహుమతి ఇవ్వడం జరిగింది. కార్పెంటర్స్‌కు గదులు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కార్పెంటర్స్ ఐక్యమత్య సమితి వారికి నాకు సన్మానం చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, కూటమి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ ప్రతి ఒక్క కార్పెంటర్ ఆరు రోజులు శిక్షణ తీసుకొని బ్యాంకుల్లో లోన్ తీసుకోవచ్చు అని అన్నారు. మీకు గదులు అయితే కచ్చితంగా ఏర్పాటు చేస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చాడు . ఇంకా ఏసమస్య వచ్చినా నేరుగా నాదగ్గరికి రండి వాటిని పరస్కరి చే విధంగా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ మండలం ఇంచార్జి గుమ్మనూరు నారాయణ స్వామి, జిల్లా డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ హిమబిందు , రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మెంబెర్ కెసి.హరి ,టీడీపీ పట్టణ అధ్యక్షులు బందారు ఆనంద్, టీడీపి టౌన్ సెక్రటరీ గుజిరి ఖాజా ,గుమ్మనూరు వెంకటేష్ , మాజీ కౌన్సెలర్లు అంజి, మస్తనప్ప అలాగే కార్పెంటర్స్ ఐక్యమాత్య సమితి గౌరవ సభ్యులు శిల్పి బాషా, షైక్ షా వలి, పప్పుర్ బాషా, టెంకాయల యూసుఫ్, కూటమి సభ్యులు, కార్పెంటర్స్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాల నందు గురువారం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సును అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు, పాఠశాలలో కానీ కాలేజీలో కానీ ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు విద్యార్థులు కంగారు పడకుండా ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలి విద్యార్థులను ఎలా కాపాడుకోవాలి చేయవలసిన పనులు గురించి అగ్నిమాపక సిబ్బంది పిల్లలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు, పిల్లలలో మనోధైర్యాన్ని కల్పిస్తూ అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తమకు తమ రక్షించుకోవడం ఇతరులను రక్షించుకోవడం చాలా ముఖ్యమని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ఉమాదేవికి ఘన సన్మానం

విశాలాంధ్ర - కూడేరు : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల యందు ఇంటర్ ఫస్ట్ ఇయర్ సెకండ్ ఇయర్ విద్యార్థినిలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు ఆదేశాలతో, తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి సూచనల మేరకు కూడేరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సర్పంచ్ లలితమ్మ పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవిని గురువారం ఘనంగా సన్మానించారు.కలగళ్ల ఉపాధ్యాయులు మల్లికార్జున మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో కూడేరు కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలు నూరు శాతం ఉత్తిగత సాధించడం ఎంతో సంతోషకరమైనది అని మన జిల్లాలో కూడేరు గ్రామానికి కేజీబీవీ పాఠశాలకు ఎంతో మంచి పేరు రావడంపై పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవికి, అలాగే టీచర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ ఉమాదేవిని శాలువా పూలహారాలతో ఘనంగా సన్మానించారు. కూడేరు గ్రామపంచా యతీ సర్పంచ్ మీనుగాలలితమ్మ, ఉపాధ్యాయుడు మల్లికార్జున, తెదేపా నాయకులు బొటవెంకటేష్, కొత్తపల్లి బొమ్మయ్య, జయప్రకాష్ గౌడ్, మద్దినేని శ్రీధర్ నాయుడు, గొల్ల వెంకటేష్ యాదవ్, సర్పంచ్ భర్త చిన్న ఈశ్వరయ్య, అంకెభీమ, డీలర్ శివనాయక్, రాయమ్మ, వెంకటేష్ పాఠశాల విద్యార్థులు టీచర్లు పాల్గొన్నారు.

స్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: గ్రామాలలో స్మశానవాటికలకు స్థలాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఈ ఎస్ వెంకటేష్ తెలిపారు. కొత్తచెరువు మండల పరిధిలోని ఇరుగంపల్లి గ్రామంలో ప్రజలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరగంపల్లి, వంగంపల్లి, నాగిరెడ్డి పల్లి గ్రామాల్లో స్మశాన వాటిక లకు స్థలాలు లేక కాలువ గట్లల్లోనూ చెరువు మునగల్లోనూ శవాలను పుడుచుతున్నారని తెలిపారు. పలు మార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోలేదన్నారు. ఈనెల 23వ తేదీ ఇరగంపల్లి నుండి కొత్తచెరువు వరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాద యాత్ర నిర్వహించి తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముత్యాలు, సిపిఎం పుట్టపర్తి ప్రాంతీయ కార్యదర్శి బ్యాళ్ల అంజి,లక్ష్మన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే ఆక్రమించిన స్థలాల తొలగింపు

విశాలాంధ్ర-రాప్తాడు: మండల పరిధిలోని మైనారిటీ కాలనీ, ఆర్ఆర్ కాలనీలో అభివృద్ధి కోసమే ఆక్రమించిన స్థలాలను తొలగించామని రాప్తాడు సర్పంచి సాకే తిరుపాలు తెలిపారు. విస్తరణ పేరుతో కూల్చివేత అనే శీర్షిక ఓ దినపత్రికలో ప్రచురించడాన్ని గురువారం ఆయన ఖండించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే మైనారిటీ కాలనీలో రూ.50 లక్షల నిధులతో ప్రతి వీధిలో సిసి రోడ్లు నిర్మించామన్నారు ప్రస్తుతం మైనారిటీ కాలనీ మెయిన్ రోడ్డులో వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండి ప్రజలకు అసౌకర్యంగా ఉండడంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా మెయిన్ రోడ్‌లో, సీసీ రోడ్డు పరుగు కాలువల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 53 అడుగుల రోడ్డు ఉండగా ప్రజలకు ఇబ్బంది లేకుండా 46 అడుగుల సిసి రోడ్డుకు కుదించి నిర్మాణ పనులు మొదలు పెట్టామని.. అయితే కొందరు దురుద్దేశంతో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించడానికి ప్రజల నిర్మాణాలను కూల్చివేస్తున్నట్టుగా అబద్ధపు ప్రచారం చేసి ఓవార్తాపత్రికలో ప్రచురించారన్నారు. ఈ నిర్మాణ పనుల ద్వారా ప్రజలకు, వారి ఆస్తులకు ఎటువంటి ఆస్తి నష్టం కలిగించకుండా కేవలం ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలైన కాంపౌండ్, బండలు మాత్రమే అధికారులు తొలగిస్తున్నారన్నారు. కావున ఓ వార్తాపత్రికలో ప్రచురితమైన వార్త పూర్తిగా అసత్యం, అవాస్తవమని, ఇది కేవలం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నంగా ఉన్నందున రాప్తాడు గ్రామ సర్పంచ్ గా దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.

ఫైలేరియా బాధితుల నైట్ బ్లడ్ కలెక్షన్ సేకరించాలి

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయలచెరువు వేములపాడు కొట్టాలపల్లి గ్రామాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాలు మేరకు జిల్లా మలేరియా అధికారి సూచనలు మేరకు గురువారం నుండి కొట్టాలపల్లి గ్రామం ఫైలేరియా నైట్ బ్లడ్ కలెక్షన్ తీయవలెనని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొట్టాల పల్లె గ్రామములో రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది ఆరు టీములుగా ఏర్పడి ఏఎన్ఎంలు ఎం ఎల్ హెచ్ పీ లు ఆశాలు ఒక్కొక్క టీం 50రక్తపూతలు తీయవలెనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ షబ్బీర్ అహ్మద్ ఏఎన్ఎంలు ఎం.ఎల్ హెచ్ పి లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో చేర్పులు మార్పులపై రాజకీయ పార్టీలతో చర్చలు

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ రెవెన్యూ డివిషనల్ అధికారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయము, నందు అసెంబ్లీ నియోజకవర్గంలో అన్ని రాజకీయాల పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశము నందు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు తొలగింపులు గురించి అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో చర్చించడం జరిగినది. ఈ సమావేశమునకు నియోజక వర్గంలోని ఏ ఈ ఆర్ వో లు, సీనియర్ సహాయకులు ఎన్నికలు, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి

విశాలాంధ్ర-ఉరవకొండ: వజ్రకరూరు మండలం తట్రకల్ గ్రామంలో గురువారం కస్తూరిబా పాఠశాల ఆవరణంలో హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు, బి.మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రిన్సిపల్స్ ధనలక్ష్మి, పాఠశాల సిబ్బంది విద్యార్థినీలు పాల్గొన్నారు.

సబ్సిడీ స్ప్రేయర్ల పంపిణీ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: మండలంలో రైతులకు మంజూరైన సబ్సిడీ స్ప్రేయర్లను మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ గురువారం పంపిణీ చేశారు. ఏఓ సాయికుమార్ మాట్లాడుతూ హోండా కంపెనీకి చెందిన 14 పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేయడం జరిగిందని 50 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరిగిందని పవర్ స్ప్రేయర్కు రూ.16,010లు, బ్యాటరీ స్ప్రేయర్కు రూ.3590లు రైతులు చెల్లించాల్సి ఉందని ఏఓ తెలిపారు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాక్టర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని ఆసక్తి గల రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థినిలకు అగ్ని ప్రమాదాల నివారణ పై అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి భీమ లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, మంటలను ఆర్పటంలో మెలకువలను, మంటల్లో చిక్కుకున్నప్పుడు తప్పించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రాక్టికల్ గా మంటలను ఆర్పడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.